క్లుప్తంగా

అలరించిన సంగీత కచేరీ


వయోలిన్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్: ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన వయోలిన్ సంగీత కచేరీ అలరించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మునికుమార్ మాట్లాడుతూ.. కళాశాలలో విద్యార్థులు అభ్యసించిన అంశాల్లో ప్రతి వారం ప్రదర్శన ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులు నేర్చుకున్న అంశాలను చక్కగా ప్రదర్శిస్తున్నారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

డీఆర్‌ఓను కలిసిన ఎన్‌జీఓ నేతలు


డీఆర్‌ఓ నారాయణమ్మకు బొకే అందిస్తున్న ఏపీ ఎన్‌జీఓ సంఘం నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా రెవెన్యూ అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నారాయణమ్మను ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ నేతలు మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. బుధవారం డీఆర్‌ఓ చాంబరులో ఆమెను కలసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డి మాట్లాడుతూ.. వివిధ శాఖల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, జిల్లా కార్యదర్శి జవహర్‌లాల్, నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న తదితరులు ఉన్నారు.

17న భగవద్గీత పఠన పోటీలు

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళి ఈనెల 17వ తేదీ ఉదయం 8.30 గంటలకు జిల్లాస్థాయి భగవద్గీత పఠన పోటీలు నిర్వహించనున్నట్లు మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు. వివరాలకు 98485 63096 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

‘తియ్యని’ మార్పు

జీవనశైలి మార్చిన డయాబెటీస్

- సిరిధాన్యాలపై జనం మక్కువ
- ఆహారంలో కూరగాయలు, పండ్లకు పెరిగిన ప్రాధాన్యత
- నేడు వరల్డ్ డయాబెటీస్ డే


కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎండ్రోక్రైనాలజీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు

కర్నూలు(హాస్పిటల్): ఒకప్పుడు జొన్న, రాగి సంకటి తినమంటే అదేదో పేదవారి తిండి అనుకునేవారు. కొర్రలు, ఊదలు, అరికెలు వంటి సిరి ధాన్యాలు కేవలం పేదవారి ఇళ్లల్లోనే వండేవారు. కాయకష్టం చేసి జీవించే వారికి ఇదే బలవర్ధకమైన ఆహారం. కానీ ఇప్పుడు ఆ పదార్థాలన్నీ ధనికుల ఇళ్లల్లోనే ఉంటున్నాయి. షుగర్ వ్యాధి కాలాన్ని తిరగేసింది. మనుషులను మార్చింది. ఏ పదార్థాలనైతే డబ్బున్న వారు దూరం పెట్టారో వాటినే ఇప్పుడు అధిక ధరలకు కొనుగోలు చేసి తింటూ జీవిస్తున్నారు. షుగర్ జబ్బు కారణంగా జీవనశైలిలో మార్పులు చేసుకోవడంతో పాత ఆహార నియమాలకు ప్రాధాన్యత పెరిగింది. ఈనెల 14న వరల్డ్ డయాబెటీస్ డే సందర్భంగా ‘సాక్షి’ కథనం.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎండోక్రైనాలజీ విభాగానికి ప్రతి వారంలో మంగళ, శుక్రవారాలు ఓపీ ఉంటుంది. ప్రతి వారం 300 నుంచి 400 మంది రోగులు చికిత్స కోసం వస్తున్నారు. ఇందులో 50 శాతం మంది ఇన్సులిన్ వాడేవారున్నారు. వీరుగాక టైప్–1డయాబెటీస్ రోగులు నెలకు 50 నుంచి 60 మంది దాకా ఉంటున్నారు. ఎండోక్రైనాలజీ విభాగంలో షుగర్‌వ్యాధిగ్రస్తులను చేర్చుకుని చికిత్స అందించేందుకు 20 పడకలు ఏర్పాటు చేశారు. నెలకు ఇందులో 60 నుంచి 80 మంది చికిత్స పొందుతున్నారు. షుగర్ వ్యాధికి చికిత్సను ఎండోక్రైనాలజిస్టులతోపాటు జనరల్ ఫిజీషియన్లు, డయాబెటాలజీ డిప్లమా కోర్సు చేసిన వారు అందిస్తున్నారు. ఇలాంటి వైద్యుల సంఖ్య జిల్లాలో 2,500లకు పైగానే ఉంది. ప్రతిరోజూ వీరి వద్దకు వచ్చే డయాబెటీస్ రోగుల సంఖ్య 10 వేలకు పైగానే ఉంటోంది.జిల్లా జనాభాలో 18 శాతం(8లక్షల మంది) మందిషుగర్‌వ్యాధితో బాధపడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో షుగర్‌తోపాటు గుండె, కిడ్నీ, కంటి, నరాలు, కీళ్లజబ్బులతో బాధపడే వారి సంఖ్య 5 లక్షల దాకా ఉంటుందని అంచనా.

వ్యాధిపై ప్రజల్లో అవగాహన

వ్యాధిపై ప్రజల్లో అవగాహన వచ్చింది. అందుకే ఇటీవల ఆహార నియమాల్లో మార్పులు చేసుకుంటున్నారు. సిరిధాన్యాలు, రాగులు, జొన్నలు, గోధుమలు, కూరగాయలు, పండ్లు తమ ఆహారంలో చేర్చుకుంటున్నారు. ఎక్కువ మంది వాడటం వల్ల వీటి ధరలూ పెరుగుతున్నాయి. మధుమేహ నియంత్రణలో జొన్నరొట్టెలు బాగా పనిచేస్తాయని తెలియడంతో చాలా మంది వీటిని తినేందుకు మొగ్గుచూపుతున్నారు. ఉసిరికాయలు, నేరేడు, జామపండ్లకూ గిరాకీ పెరిగింది.

నేడు అవగాహన సదస్సు



పిల్లలకు షుగర్ ఉంటే వారి పట్ల తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులకు అవగాహన ఉండాలి. ఆసుపత్రిలో వైద్యులతోపాటు నర్సులకూ అవగాహన ఉండాలి. షుగర్ వ్యాధిపై గురువారం ఆస్పత్రిలో అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నాం. మందులు వాడితే షుగర్ తగ్గిపోతుందని భావించకుండా మితాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. క్రమబద్ధమైన జీవనాన్ని సాగిస్తే తక్కువ మందులతో షుగర్‌వ్యాధి ఉన్నా హాయిగా జీవించవచ్చు.

– డాక్టర్ పి.శ్రీనివాసులు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎండ్రోక్రైనాలజీ హెచ్‌ఓడీ

అధిక బరువుతో అనర్థాలు



సమాజంలో 50 శాతం మందికి వారికి షుగర్ వచ్చినట్లు తెలియదు. అధిక బరువు, విపరీతమైన ఆహారం, తీవ్ర మానసిక ఒత్తిళ్లు, ధూమపానం, మద్యపానం అలవాట్లు దీనికి ప్రధాన కారణమవుతున్నాయి. మధుమేహం ఉన్న వారు వారి ఆరోగ్యం పట్ల నిరంతరం జాగ్రత్తలు పాటించాలి. సాధారణంగా 36 శాతం మందికి మధుమేహ సమస్యలపై మానసిక ఒత్తిడి ఉంటుంది. 63 శాతం మందికి మధుమేహ సంబంధిత సమస్యల భయంతో బాధపడు తున్నారు. ఈ వ్యాధిపై సంపూర్ణ అవగాహన చేసు కుని మసలుకుంటే జీవనం హాయిగా సాగుతుంది. – డాక్టర్ సి. గోపీనాథ్‌రెడ్డి, ఇంటర్నల్ మెడిసిన్, కర్నూలు

మూత్రంలో ప్రొటీన్ పోతుంటే జాగ్రత్త



షుగర్ వ్యాధిగ్రస్తులకు మూత్రంలో ప్రొటీన్ ఎక్కువ గా పోతుంటే జాగ్రత్త పడాలి. మూత్రంలో ప్రొటీన్ ఎక్కువగా వెళ్లే వారికి హార్ట్ ఎటాక్, పక్షవాతం వచ్చే అవకాశాలు ఎక్కువ. ప్రొటీన్ ఎక్కువ పోవడం ప్రారంభమయ్యాక 4, 5వ దశల్లో వస్తే డయాలసిస్ చేయించాల్సిందే. అంతకుముందే జాగ్రత్త పడి పరీక్షలు చేయించుకుని మందులు వాడాలి. ఇప్పటికే షుగర్ ఉన్న వారు నెలకోసారి మూత్రపరీక్ష చేయించుకోవాలి. షుగర్, బీపీని నియంత్రణలో ఉంచుకోవాలి. డయాలసిస్ చేయించుకుంటున్న వారిలో 50 నుంచి 60 శాతం షుగర్ రోగులే. దీనిని బట్టి కిడ్నీలపై షుగర్ ఎలాంటి ప్రభావం చూపుతుందో అర్థమవుతుంది.

– డాక్టర్ సిద్దార్థ హెరూర్, నెఫ్రాలజిస్టు, కర్నూలు

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు


వినాయక ఘాట్ వద్ద రహదారి విస్తరణను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. ఆయన బుధవారం స్థానిక నగరపాలక, పోలీసు అధికారులతో కలిసి గాయత్రీ ఎస్టేట్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, రాజ్‌విహార్, ఆనంద్ టాకీస్ ప్రాంతాల్లో పర్యటించారు. కేసీ కెనాల్ వద్ద శుక్రవారం నిర్వహించనున్న కార్తీక దీపోత్సవానికి సంబంధించి ఏర్పాట్లు, పాత కృష్ణానగర్ రైల్వే బ్రిడ్జిని పరిశీలించారు. గాయత్రీ ఎస్టేట్ కూడలి వెడల్పు తగ్గించడం, రాజ్‌విహార్‌లో వాటర్ ఫౌంటెన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద చెట్ల కొమ్మలు తొలగించాలని, ఆనంద్ థియేటర్ వద్ద కూడలి ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. రహదారుల భద్రత కమిటీ సూచనల ప్రకారం ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆనంద్ టాకీస్ వద్ద మరో కూడలి ఏర్పాటు చేస్తామని, తద్వారా బస్టాండ్ వైపు నుంచి వచ్చే వాహనాలు కిసాన్ ఘాట్, వినాయక్‌ఘాట్ వైపు మళ్లించవచ్చన్నారు. ఫలితంగా రాజ్‌విహార్ వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందన్నారు. పాత కృష్ణానగర్ అండర్ బ్రిడ్జి వద్ద మురుగు నీటి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించామని, త్వరలో శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సీఐలు మన్సూరుద్దీన్, హుస్సేన్, ఎంఈ సత్యనారాయణ, డీఈఈ మనోహర్ రెడ్డి, కృష్ణలత, దామోదర్ ఉన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ప్రజాపోరు

- కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై సీపీఎం ఆధ్వర్యంలో నిరసన


పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): సీపీఎం చేపట్టిన ప్రజాపోరు యాత్రలో భాగంగా గురువారం కలెక్టరేట్, మండల కార్యాలయాల ముట్టడించనున్నారు. ఇందుకు జిల్లా నలుమూలలతోపాటు నగరంలోని అన్ని డివిజన్ల నుంచి పెద్ద ఎత్తున సీపీఎం నాయకులు, కార్యకర్తలు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నెల 8 నుంచి 13వ తేదీ సీపీఎం నాయకులు ప్రజాపోరు యాత్ర ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. సీఎం చంద్రబాబు ఐదు నెలల పాలనలో ప్రజలను మోసగించిన విధానంపై అవగాహన కల్పించారు. ఈ క్రమంలో కలెక్టరేట్ ముట్టడి, మండల కార్యాలయాల ముట్టడి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.నిర్మల బుధవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు ఐదు నెలల్లోనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కూటమి పాలనలో రౌడీయిజం పెచ్చుమీరిపోతోందని విమర్శించారు. మద్యం పాలసీ పేరిట ఊరూరా బెల్టుషాపులను పెంచి పోస్తున్నారని ఆరోపించారు. ఉచిత ఇసుకను ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చి రౌడీయిజం చేయిస్తున్నారని మండిపడ్డారు. ఇసుకను కొనుగోలు చేయడానికి కూడా లేకుండా చేశారని, గత ప్రభుత్వం కంటే ఎక్కువగా ట్రాక్టర్, టిప్పర్ల రవాణా ధరలు ఉన్నాయన్నారు. నాలుగు నెలలు గాకమునుపే విద్యుత్ ట్రూఅప్ చార్జీల పేరిట ఏకంగా రూ.20 వేల కోట్ల భారం ప్రజలపై మోపడం అన్యాయమన్నారు. ఒక్క రహదారిని కూడా బాగు చేయలేదని, సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటి కూడా పరిపూర్ణంగా అమలు చేయలేదని, ఈ వైఫల్యాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థతో పాటు జిల్లాలోని గ్రంథాలయ శాఖల్లో గురువారం నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి రోజు ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంతో పాటు గ్రంథాలయాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో పాటు జిల్లా అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

అంబులెన్స్ ఓనర్లు, డ్రైవర్ల సంఘం ఏర్పాటు


నూతన సంఘాన్ని అభినందిస్తున్న ఎస్.మునెప్ప తదితరులు

కర్నూలు(సెంట్రల్): ఏఐటీయూసీ అనుబంధంగా అంబులెన్స్ ఓనర్లు, డ్రైవర్ల సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప తెలిపారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో అంబులెన్స్ ఓనర్లు, డ్రైవర్ల సంఘానికి సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఐ.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఎస్.అబ్దుల్‌ఖాదర్, ఎస్.రహీంబాషా, ప్రధాన కార్యదర్శిగా ఎస్.అప్సర్‌బాషా, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.షాకీర్ బాషా, ఆర్.భాస్కర్‌నాయక్,ట్రెజరర్‌గా ఎస్.ఫజల్ బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఏఐటీయూసీ నాయకులు టి.రామాంజనేయులు, కృష్ణారెడ్డి, అవుల ఆశ్వర్, రాము, ఈశ్వర్‌రెడ్డి, నల్లన్న పాల్గొన్నారు.

శబరి గిరీశా.. శరణం అయ్యప్పా


మణికంఠ అయ్యప్పస్వామి ఆలయం

కర్నూలు కల్చరల్: నగరంలో కేసీ కాలువ పక్కనే చలువ రాయితో (గ్రానైట్) నిర్మితమైన సప్తగిరి మణికంఠ అయ్యప్పస్వామిఆలయం స్వామివారి నామస్మరణతో మార్మోగుతోంది. ఇక్కడ నిత్యం వెయ్యి మందికి పైగా అయ్యప్ప మాలధారులు భిక్ష స్వీకరిస్తుండటం విశేషం. జిల్లాకు తలమానికంగా నిలుస్తున్న ఈ ఆలయం 23వ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించేందుకు కమిటీసభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అద్భుతం.. ఆలయ నిర్మాణం

నగరంలో 2001లో కేసీ కెనాల్ పక్కన దాతల సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టి మణికంఠ అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ ఆవరణలో శక్తి ప్రధాత చౌడేశ్వరీ దేవి విగ్రహాన్ని నెలకొల్పారు, హరిహరుల 27 అడుగుల నిలువెత్తు విగ్రహం ఉండటం మరో విశేషం. ఇక్కడే 2006లో కైలాసగిరి ఆలయం నిర్మించారు. రెండున్నర అడుగుల మరకత లింగం, మరకత గణపతి, భరతమాత, అష్టాదశ శక్తి పీఠాలు, జ్యోతిర్లింగ రూపాలను ఏర్పాటు చేశారు. వీటితో ఆలయం ఆధ్యాత్మిక శోభతో అలరారుతోంది.

అన్నదానం.. యజ్ఞం చేసిన ఫలం

అన్నం పరబ్రహ్మ స్వరూపం. ఆకలితో అలమటించే వారికి పట్టెడన్నం పెట్టడం యజ్ఞం చేసిన ఫలితాన్నిస్తుంది. కార్తీక మాసం శుభవేళలలో భక్త పుంగవులైన దీక్షాధారులకు, శ్రేష్ఠులకు అన్నదానం చేస్తే త్రిలోకాల్లో యశస్సు, తేజస్సు, బలం సిద్ధిస్తాయి. ఈ సంకల్పంతో మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదాన కమిటీ ద్వారా 2002 కార్తీక పాడ్యమి రోజు అన్నదానం ప్రారంభమైంది. అప్పటినుంచి ఏటా కార్తీక పాడ్యమి నుంచి సంక్రాంతి వరకు దాదాపు 75 రోజులపాటు అన్నదాన కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. అన్నదానానికి రూ.5 వేలు మొదలుకొని రూ.లక్ష వరకు విరాళాలు ఇచ్చిన దాతలు ఉన్నారు. రోజుకు 1200 మంది అయ్యప్ప భక్తులకు అన్నదానం నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత.


ఆలయంలో అయ్యప్ప స్వామి విగ్రహం

వార్షికోత్సవ కార్యక్రమాలు ఇలా..

ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఉదయం 5 గంటల నుంచి మహాగణపతి హోమం, నవాభిషేకం, లక్షబిల్వార్చన, 11 గంటలకు మహాకుంబాభిషేకం, 12 గంటలకు భక్తులకు భిక్ష, సాయంత్రం 4 గంటలకు భార్గవకుమార్ శిష్యబృందంచే సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు, 5 గంటలకు పడిపూజ, భజన, 6 గంటలకు కర్నూలు జిల్లా తొగట వీర క్షత్రియ సేవా సంఘం వారి సారధ్యంలో భాస్కర్‌నగర్ అయ్యప్ప దేవాలయం నుంచి సప్తగిరి మణికంఠ అయ్యప్ప దేవాలయంలోని చౌడేశ్వరీ మాత సన్నిధి వరకు జ్యోతి ఉత్సవం కార్యక్రమాలు ఉంటాయి.

బంగారు గొలుసు అప్పగింత

కర్నూలు (టౌన్): రైలులో ప్రయాణిస్తూ పోగొట్టుకున్న బంగారు గొలుసును రైల్వే పోలీసులు తిరిగి బాధితుడికి అందజేశారు. కర్నూలు రైల్వే సీఐ శ్రీనాథ్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన బొడ్డు శేఖర్ ఈనెల 12వ తేదీ పాలకొల్లు నుంచి కంభంకు వెళ్లేందుకు టీఆర్ 17225 అమరావతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేశారు. కంభంలో దిగే సమయంలో ఆయన మెడలోని 33 గ్రాముల బంగారు గొలుసు కనిపించలేదు. రైలులో పడిపోయినట్లు భావించి కంభం రైల్వేస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు బాధితుడు ప్రయాణించిన బెర్త్ వద్ద రైల్వే పోలీసులు వెతికగా బంగారు గొలుసు కనిపించింది. దీంతో బుధవారం బాధితుడికి బంగారు గొలుసును తిరిగి అప్పగించినట్లు సీఐ తెలిపారు.

మృతదేహాలూ గురువులే !


మృతదేహంపై ప్రమాణం చేస్తున్న వైద్య విద్యార్థులు

కర్నూలు(హాస్పిటల్): మరణించిన వారూ మీకు పాఠాలు నేర్పుతారు, మృతదేహానికి, వారి కుటుంబసభ్యులకు కృతజ్ఞత తెలపండి అని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ వైద్య విద్యార్థులకు సూచించారు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు మెడికల్ కాలేజీలోని అనాటమి డిపార్ట్‌మెంట్‌లో బుధవారం ‘కెడావరిక్ ఓథ్ (మృతదేహంపై ప్రమాణం) నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ.. వైద్య విద్యార్థులకు మృతదేహాలే మొదటి గురువులని, అందుకే అనాటమీ డిపార్ట్‌మెంట్‌లో ‘ఇక్కడ మరణించిన వారు జీవించిన ఉన్న వారికి పాఠాలు చెబుతారు’ అని రాసి ఉంటుందని చెప్పారు. వైద్య విద్యార్థులు మృతదేహంపై ప్రాక్టికల్స్ నిర్వహిస్తారని, మానవ శరీరంలో అంతర్గతంగా ఏఏ భాగాలు ఎక్కడెక్కడ ఉంటాయి, ఎలా ఉంటాయని నేరుగా చూడటం, స్పర్శించడం ద్వారా తెలుసుకుంటారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, సాయిసుధీర్, రేణుకాదేవి, విజయానందబాబు, అనాటమి హెచ్‌ఓడీ డాక్టర్ శోభారాణి తదితరులు ఉన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలులోని బహుళార్థ పశు వైద్యశాలలో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేస్తూ అనారోగ్యానికి గురైన ఆర్.గణేష్‌కు పశుసంవర్ధక శాఖ అధికారులు, వైద్యులు, కార్యాలయ సిబ్బంది ఆర్థిక చేయూతనిచ్చారు. ఆయన మెదడులో రక్తం గడ్డకట్టడం వల్ల పక్షవాతానికి గురికావడంతో కుడి కాలు, కుడి చేయి పనిచేయకపోవడం, మాట పడిపోవడంతో కర్నూలు సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈయనకు మెరుగైన వైద్యం అందించేందుకు సంబంధిత శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది చేయిచేయి కలిపి రూ.94,516 నగదు సిద్ధం చేశారు. ఈ మొత్తాన్ని బుధవారం జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్, బహుళార్థ పశువైద్యశాల డీడీ హేమంత్‌కుమార్ తదితరులు బాధితుడికి అందచేశారు.

అప్పు తీసుకొని బెదిరింపులు

కర్నూలు (టౌన్): అప్పు తీసుకొని తిరిగి ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నాడని నగరంలోని గోపీనగర్‌కు చెందిన చత్రపతిరెడ్డి నాలుగవ పట్టణ పోలీసులను ఆశ్రయించారు. వివరాలు.. ఖమ్మం జిల్లా సింగరేణి మండలం కారేపల్లి గ్రామానికి చెందిన మొర్రి శెట్టి రవి అనే వ్యక్తితో ఆర్థిక పరమైన లావాదేవీలు ఉన్నాయి. రూ. 1.26 కోట్లకు సంబంధించిన లావాదేవీలపై వివాదాలు నెలకొన్నాయి. డబ్బులు అడిగినా తిరిగి ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల మొర్రి శెట్టి తమ్ముడు జగన్‌లు తనపై అసభ్యకరంగా వీడియోలు పోస్టు చేస్తు మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జియో ట్యాగింగ్ పూర్తి చేయండి


జియో ట్యాగింగ్‌పై సూచనలు చేస్తున్న అదనపు కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ సచివాలయాల్లో పెండింగ్‌లో ఉన్న జియో ట్యాగింగ్‌ను వెంటనే పూర్తి చేయాలని అదనపు కమిషనర్ ఆర్.జీ.వి.కృష్ణ ఆదేశించారు. బుధవారం స్థానిక గురురాఘవేంద్ర నగర్‌లోని 92వ సచివాలయాన్ని అదనపు కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జియో ట్యాగింగ్ విషయంలో సచివాలయాల ఉద్యోగులు జాప్యం చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి జియో ట్యాగింగ్ పూర్తి చేయాలన్నారు. మేనేజర్ చిన్నరాముడు, ఆర్‌ఐలు భార్గవ్, తిప్పన్న మన్సూర్ ఉన్నారు.

నేటి నుంచి క్రీడాపోటీలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో గురువారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు పీజీ విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు పేర్కొన్నారు. ఫ్రెషర్స్ డే వేడుకలను పురస్కరించుకొని స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటులో భాగంగా నగరంలో గురువారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు ఈఈ శేషాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు వెల్లడించారు. క్యాంపు సెక్షన్, మిలటరీ కాలనీ పరిధిలోని నగరాలు, కాలనీలలో కోతలు విధించనున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.